క్లుప్తంగా

నేడు శ్రీనివాస కళ్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

డోన్: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో గురువారం శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయంలోని కల్యాణ మండపంలో గోవింద మాలాధారుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే సాయంకాలం గోదాదేవి, శ్రీదేవి సమేతుడైన శ్రీనివాసుడిని పట్టణ పురవీధుల గుండా ఊరేగిస్తామన్నారు.

చండీయాగానికి నేడు పూర్ణాహుతి



శివుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దీక్ష విరమణ సందర్భంగా ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్న చండీయాగం గురువారం పూర్ణహుతి కార్యక్రమంతో ముగుస్తుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ బుధవారం తెలిపారు. చండీయాగంలో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదపండితులు శివుడు, యాగశాలలో ఏర్పాటు చేసిన చౌడేశ్వరిదేవి ఉత్సవమూర్తికి వేదమంత్రోచ్చరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఏపీ జేఎఫ్ఏ రాయలసీమ జోన్ సెక్రటరీగా మౌలాలి



మౌలాలీ

డోన్ టౌన్: ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ రాయలసీమ జోన్ సెక్రటరీగా డోన్ ఫారెస్టు శాఖ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మౌలాలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో మౌలాలిని రాయలసీమ జోన్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ.. అటవీ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

కోవెలకుంట్ల: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ హెచ్చరించారు. బుధవారం రాత్రి పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తాలో సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జున రెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహన చోదకులను ఆపి డ్రంకన్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలడంతో వారిపై కేసు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుని విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించి బైక్‌లు నడపాలని సూచించారు.

గడ్డివామికి నిప్పు



కాలిపోయిన వరి గడ్డి

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కోట్ల భాస్కర్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న సుధాకర్ నాయుడుకు చెందిన గడ్డివామి అగ్నికి ఆహుతైంది. పాడి పశువుల కోసం నిల్వ చేసుకున్న వరి గడ్డికి మంగళవారం రాత్రి నిప్పు రాసుకొని మంటలు చెలరేగడంతో బాధిత కుటుంబసభ్యులు ఇంటికి ఉన్న బోరు పైపుతో నీటిని చల్లి మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.80 వేల విలువ చేసే వరి గడ్డి కాలి పోయినట్లు బాధితులు వాపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టినట్లు బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏసు మార్గంలో నడవాలి

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

కోవెలకుంట్ల: ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని చర్చి ఆఫ్ సౌత్ ఇండియన్ డివిజనల్ చైర్మన్ ఐజక్‌బాబు పిలుపునిచ్చారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆయా చర్చీలు, ప్రార్థనా మందిరాల్లో పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోవెలకుంట్ల- నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో రోమన్ కాథలిక్ మిషన్ చర్చిలో(ఆర్‌సీఎం), చర్చిఆఫ్ సౌత్ ఇండియన్(సీఎస్ఐ) చర్చీలతో పాటు మండలంలోని గ్రామాల్లో రాత్రి 2 గంటల నుంచి ప్రారంభమైన ప్రార్థనా కార్యక్రమాలు తెల్లవారుజాము వరకు కొనసాగాయి. ఆరాధన, వాక్యపరిచయం, బైబిల్ పఠనం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని హోసన్నా, నూతన యేరుసలేం, హెబ్రోను, మిస్పా తదితర ప్రార్థనా మందిరాల్లో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ఆయా చర్చీల ఆవరణాల్లో నిర్వహించిన పలు స్కాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు అలరించాయి. కార్యక్రమంలో ఆయా చర్చిల ఫాదర్లు లూర్దయ్య, కిషోర్, సుధాకర్, ఆయా చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





కోవెలకుంట్ల ఆర్‌సీఎం చర్చిలో అలంకరించిన మేరిమాత విగ్రహం, గుళ్లదూర్తి సీఎస్ఐ చర్చిలో కేక్‌కట్ చేసి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న పాస్టర్ ప్రేమ్‌సాగర్

ఘనంగా క్రీస్తు జన్మదినం



బనగానపల్లెలోని సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ సందేశం వివరిస్తున్న రెవరెండ్ దైవాదీనం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని క్రైస్తవులు అత్యంత ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే మండలంలోని పలు గ్రామాల్లో ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు చేశారు. అనంతరం ఏసు పుట్టిన రోజు గుర్తు చేస్తూ యువకులు సిలువను మోస్తూ క్రైస్తవుల ఇంటింటి వద్దకు వెళ్లి క్రిస్మస్ కుటుంబ ఆరాధన చేసి, శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రమైన బనగానపల్లె పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ దైవదినం, మథర్ థెరిస్సా చర్చిలో ఫాదర్ డాక్టర్ బాబురాజ్ ఆధ్వర్యంలో పంచమపేటలోని చర్చి, పెండేకంటి నగర్‌లోని పెంతేకొస్తు, నంద్యాల రోడ్డులో ఉన్న హోసన్న ప్రార్థన మందిరం, ఏసుకృపా తదితర మందిరాల్లో ఉదయం ప్రత్యేక క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. సాయంత్ర పలు గ్రామాల్లో ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



అంబరాన్నంటిన సంబరాలు

కొలిమిగుండ్ల: ఏసుప్రభువు జన్మదినం సందర్భంగా బుధవారం మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో చర్చీలు వెలిగిపోయాయి. కొలిమిగుండ్ల, బెలుం, అబ్దులాపురం, కల్వటాల, కోటపాడు, తుమ్మలపెంట, తిమ్మనాయినపేట, పెద్దవెంతుర్ల తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు జరిగాయి. ఆయా గ్రామాల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి విశ్వాసులకు ఆశీస్సులు అందజేశారు.

కొలిమిగుండ్ల మండలం అబ్దులాపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

లోక రక్షణకే కరుణామయుడి జననం





డోన్: సీఎస్ఐ చర్చిలో దైవ వాక్యం వినిపిస్తున్న పాస్టర్, డోన్: సీఎస్ఐ చర్చి వద్ద పేదలకు వస్త్రదానం

డోన్: నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని చర్చిలను విద్యుత్ బల్బులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ఏసుప్రభును స్తుతిస్తూ ప్రార్థనలు జరిపారు. స్థానిక పాతబస్టాండ్‌లో 102 సంవత్సరాల క్రితం నిర్మించిన సీఎస్ఐ చర్చి విద్యుత్ కాంతులతో వెలిగిపోయింది. చర్చి ఫాదర్‌లు రాజేంద్ర బాబు, సామేల్, హోసన్నా, ప్రార్థన మందిరం ఫాదర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బైబిల్ సూక్తులను వివరించారు.

- స్థానిక సీఎస్ఐ చర్చి వద్ద ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్, తారకరామనగర్ చర్చి వద్ద సమైక్య కిస్టియన్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు ఆదాం, నాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్, పాస్టర్ బార్నబస్, ప్రభుదాస్, ప్రకాష్, కరుణాకర్ తదితరులు నిరుపేదలకు చీరలను పంపిణీ చేశారు.
- **ప్యాపిలి:** మండలంలోని క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సియోను, క్రీస్తు సంఘం, సీఎస్ఐ, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం, బైబిల్ మిషన్ తదితర చర్చిలను సుదరంగా అలంకరించారు. ఉదయం నుంచి క్రైస్తవులు చర్చిలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయా చర్చిలలో పాస్టర్లు క్రిస్మస్ విశిష్టతను వివరించారు. మండల పరిధిలోని రాచర్ల, గార్లదిన్నె, బావిపల్లి, హుసేనాపురం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.
- **బేతంచెర్ల:** మండలంలో క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి సమీప చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల్లో అర్ధరాత్రి వేళ క్రిస్మస్ కేక్‌లను కట్‌చేసి, హ్యాపీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో పాస్టర్లు క్రిస్మస్ పవిత్రతను వివరించారు. సిమెంట్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ వినోద్‌కుమార్, సంఘ పెద్దలు డేవిడ్ రాజు, సుధాకర్, స్వాములు, మోషె, జయాకర్, మేరమ్మ, మరియమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలుగు బాపిస్టు చర్చిలో పాస్టర్ రెవరెండ్ ప్రసంగి, సంఘం పెద్దలు జోసఫ్, యాకోబ్, యోబ్, ఎలిసా, బాలుడు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేకు కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్ఎస్ రంగాపురంలో వాక్యోపదేశకులు నారాయణరెడ్డి, తిమోతి క్రైస్తవ సోదరుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. బేతంచెర్ల ఆర్‌సీఎం, సీయస్ఐ, బైబిల్ హోసన్నా ప్రార్థన మందిరాల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఎల్ఎఫ్ఎల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు చర్చి నిర్వాహకులు పాపారాయుడు, విజయకుమారి, దానమయ్య, నరసింహనాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.





ప్యాపిలి: క్రీస్తు సంఘం చర్చిలో క్రిస్మస్ సందేశం వినిపిస్తున్న పాస్టర్ తిమోతి,ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



బేతంచెర్ల: సిమెంట్ నగర్ తెలుగు బాపిస్టు కృపాలయంలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ ప్రసంగి, క్రైస్తవులు



బేతంచెర్ల: ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



బేతంచెర్ల: శిలువను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన కొచ్చెర్వు గ్రామ దేవర



పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి



డోన్ వైపు రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్

డోన్: మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో 20 ఏళ్ల తర్వాత బుధవారం నిర్వహించిన పెద్దమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులు, బంధుమిత్రులు, స్నేహితులు, సన్నిహితులతో గ్రామం కిక్కిరిసిపోయింది. మేజర్ గ్రామ పంచాయతీ కొచ్చెర్వు గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలు తీసుకెళ్లి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు, సుఖ శాంతులతో వర్ధిల్లాలని ప్రతి ఇంటికి బూత్‌బిల్లి అనే వ్యక్తితో పొలి(జొన్న అన్నం) చల్లించుకున్నారు. గ్రామ దేవర సందర్భంగా మంగళ, బుధవారాలు అటు రాయలచెరువు రోడ్డు, ఇటు డోన్ రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు రాకేష్, ఇంతియాజ్‌బాషా, మధుసూదన్‌రావ్‌లతో పాటు ఎస్ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

ముగిసిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగ సందర్భంగా బెలుం సీఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. హోరాహోరీగా పోటీలు సాగాయి. స్థానిక సీఐ రమేష్‌రెడ్డి, బెలుంకు చెందిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి ఫైనల్ మ్యాచ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉత్కంఠగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన శివ టీం మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, తాడిపత్రికి చెందిన టీసీఈ స్పోర్ట్ క్లబ్ టీం రెండో స్థానంలో నిలిచింది. కొలిమిగుండ్ల మహేష్ టీం మూడవ స్థానం, బనగానపల్లెకు చెందిన టార్గెట్ టీం నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు దాతల సహకారంతో సీఐల చేతుల మీదుగా రూ.20,016, రూ.15,016,రూ.10,016,రూ.5016ల నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బహుమతి దాతలు సర్పంచ్ నీలం మారమ్మ, కొలిమిగుండ్ల ధనరాజు, ఏసేయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ బాలమద్దిలేటి

నేడు ఉచిత వైద్య శిబిరం

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. వైద్య శిబిరంలో గుండె, కంటి జబ్బులకు సంబంధించి నంద్యాల శాంతిరాం ఆసుపత్రి డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సాధారణ జబ్బులకు కూడా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. అవసరమైన వారికి అద్దాలు ఇస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన రోగులకు నంద్యాల శాంతి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కోవెలకుంట్ల పరిసర ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కిరాణాషాపులో చోరీ

కోవెలకుంట్ల: పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తాలో మంగళవారం అర్ధరాత్రి ఓ కిరాణా కొట్టులో చోరీ జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన రాజేష్ రాత్రి కిరాణా షాపు షట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు షట్టర్‌కు వేసిన తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. కౌంటర్ టేబుల్‌లో ఉన్న రూ. 8 వేల నగదు, సిగరెట్ ప్యాకెట్లను అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం షాపుకు వచ్చే సరికి షట్టర్ తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. చోరీ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వాజ్‌పేయ్‌కి ఘన నివాళి

బేతంచెర్ల: దేశపురోభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ అని బీజేపీ నాయకులు మధుమోహన్ రెడ్డి, నాగమోహన్, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు, బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి బీజేపీ నాయకులు, హిందూ ధార్మిక సంఘాల నాయకులు మారుతి కృష్ణ, బాలీశ్వర్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గృహ యజమానులకు నోటీసులు

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇటిక్యాల రెవెన్యూ పరిధిలో ఉన్న గృహాల బేస్‌మెంట్‌లకు రెవెన్యూ సిబ్బంది నోటీసులు అతికించారు. 112/ఏ,738,763,765 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో కొంత మంది ఏడాది క్రితం ఇళ్ల నిర్మాణాలు చేసుకోగా మరి కొంత మంది బేస్‌మెట్‌లు నిర్మించుకున్నారు. ఇందులో కొంత మంది గ్రూపుగా ఏర్పాటై ప్రభుత్వ స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. మరి కొంత మంది నిరుపేదలు సొంతిళ్లు లేక పోవడంతో అష్టకష్టాలు పడి బేస్‌మెట్‌లు ఏర్పాటు చేసుకున్నారు. 120 మందికిపైగానే రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడంతో గృహ యజమానులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణాలు చేసుకున్న వాళ్లు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అభ్యంతరాలను తెలపాలని నోటీసులో పేర్కొన్నారు.

విద్యుత్ పోరుబాటకు తరలిరండి

కొలిమిగుండ్ల: పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యుత్ పోరుబాట కార్యక్రమానికి తరలిరావాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లెలోని కాటసాని స్వగృహం నుంచి ర్యాలీగా కర్నూలు రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఏడీఏకు వినతి పత్రం అందజేస్తారని చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కన్వీనర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జోరుగా కంది నూర్పిళ్లు



హార్వెస్టర్‌తో పంట కోత



కనుమకిందికొట్టాలలో కంది దిగుబడిని నూర్పిడి చేస్తున్న మహిళలు

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం, ముసలాయిచెర్వు, గూటుపల్లె, ఎం.పేండేకల్లు, ఆర్.కొత్తపల్లె, ఆర్ఎస్ రంగాపురం, నాగమ్మళ్లకుంట, కనుమకింది కొట్టాల, గోరుమానుకొండ, బేతంచెర్ల గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో 8700 హెక్టార్లకు పైగా కంది పంటను సాగు చేయగా ప్రస్తుతం పక్వదశకు చేరడంతో కోత పనులు ఊపందుకున్నాయి. వర్షాధార పంటగా సాగు చేసిన కందిని కొందరు కూలీలతో కోతలు చేపడుతుండగా మరికొందరు హార్వెస్టర్ మిషన్‌తో కోతలు చేపట్టారు. మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామంలోని రైతులందరూ కంది దిగుబడుల నూర్పిళ్లు ఒకే చోట చేపట్టారు. పురుషుల కంటే మహిళలే ఎక్కువగా నూర్పిడి పనులు చేస్తున్నారు. ఎరువాక సాగరో అన్నట్లుగా మహిళలందరూ ఒకే చోట చేరి ఉత్సాహంగా కంది నూర్పిడి పనులు చేస్తున్నారు.

అదృష్టం 'వరి'ంచేనా!

- కలిసిరాని ఖరీఫ్ వరి సాగు
- ఎకరాకు 30 బస్తాల్లోపే దిగుబడులు
- మార్కెట్‌లో మద్దతు ధర లేక రైతన్న విలవిల
- రబీ సాగుపై అన్నదాత ఆశలు
- నారుమడులు సిద్ధం
- సాగునీరు అంతంత మాత్రమే



కోవెలకుంట్ల సమీపంలో వరిసాగుకు సిద్ధంగా ఉన్న నారుమడి

కోవెలకుంట్ల: జిల్లాలో ఈ ఏడాది వరిసాగు రైతులకు కలిసి రాలేదు. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. వరి కోతలు, నూర్పిడి పనులు పూర్తి కాగా రబీ సీజన్ వరి సాగుపై కోటి ఆశలు పెట్టుకుని సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలోని 29 మండలాల పరిధిలోని బోర్లు, బావులు, కుందూనది, పాలేరు, కుందర వాగు, తదితర సాగునీటి వనరుల కింద 75 వేల ఎకరాల్లో కర్నూలు, నంద్యాల సోనా, షుగర్‌లెస్, 555 రకాలకు చెందిన వరిని సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో వరి సాధారణంగా అవుకు మండలంలో 2,353 ఎకరాల్లో, కోవెలకుంట్ల మండలంలో 2,377, సంజామల మండలంలో 933, ఉయ్యాలవాడ మండలంలో 2,258, దొర్నిపాడు మండలంలో 403, కొలిమిగుండ్ల మండలంలో 200 ఎకరాల్లో సాగవుతుంది. ఆయా ప్రాంతాల్లో ఖరీఫ్ వరి కోతలు, నూర్పిడి పనులు పూర్తి కాగా నారుమడులు సిద్ధం చేసుకుని ఈ నెలాఖరు నుంచి వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

కలిసిరాని ఖరీఫ్

ఈ ఏడాది రైతులు కోటి ఆశలతో ఖరీఫ్‌లో వరి సాగు చేయగా అదృష్టం వెక్కిరించింది. వేలాది రూపాయలు పెట్టుబడుల రూపంలో వెచ్చించినా పైరును అధిక వర్షాలు, తెగుళ్లు ఆశించడంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.64 లక్షల ఎకరాల్లో వరి సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల పరిధిలో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కుందూనది, పాలేరు, కుందరవాగు, కేసీ కెనాల్, తదితర సాగునీటి వనరుల కింద 1.65 లక్షల ఎకరాల్లో కర్నూలు సోనా, నంద్యాల సోనా, 555 రకానికి చెందిన వరి సాగు చేశారు. రసాయన ఎరువులు, వరినారు, క్రిమి సంహారక మందులు, కలుపు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు వెచ్చించారు. కౌలు రైతులు ఎకరాకు ఖరీఫ్‌లో 10 బస్తాలు, రబీలో మూడు బస్తాల వడ్లు చెల్లించేలా వరిమడులను కౌలుకు తీసుకున్నారు. పైరు వివిధ దశల్లో అధిక వర్షాలు కురవడంతో వరిని దోమపోటు, అగ్గి తెగులు ఆశించింది. తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. అక్టోబర్ నెలలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయలు వెచ్చించగా దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. దిగుబడులకు తోడు మార్కెట్‌లో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే పలికింది. గతేడాది క్వింటా రూ.2,200 ధర పలకగా ఈ ఏడాది బస్తా రూ.1,350లకే విక్రయించి అప్పులు మూట కట్టుకున్నారు.

రబీకి సాగునీటి గండం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగుతో నష్టాలు చవిచూసిన రైతులు రబీ సీజన్‌పై ఆశలు పెట్టుకున్నా సాగునీటి గండం పొంచి ఉంది. జిల్లాలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయం నిండింది. ఖరీఫ్ సీజన్‌కు రిజర్వాయర్ ద్వారా సాగునీరు పుష్కలంగా అందింది. అయితే రిజర్వాయర్ ద్వారా వచ్చే నెలాఖరు నుంచి ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు సాగునీటి విడుదల నిలిచిపోనుండటంతో ఈ కెనాళ్ల పరిధిలో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. కుందూనది, పాలేరు, కుందర వాగుల్లో నీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉండటంతో వరిసాగుకు ఆదిలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నెలాఖరు నుంచి వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది రబీ వరి సాగు ఎంతమాత్రం కలిసోస్తుందో వేచి చూడాల్సిందే.

ఖరీఫ్‌లో దిగుబడులు తగ్గాయి



ఎకరాకు 13 బస్తాలు వడ్లు కౌలు చెల్లించేలా ఈ ఏడాది 20 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోతలు, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.35 వేలు వెచ్చించాను. వాతావరణం అనుకూలించక ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాలేదు. కోత, నూర్పిడి సమయంలో తుపాను ప్రభావంతో వర్షాలు కురిసి ధాన్యం తడిసిపోవడంతో నష్టం వాటిల్లింది.

– శ్రీనివాసరావు, రైతు, కోవెలకుంట్ల

సాగుకు ముందే మద్దతు ధర ప్రకటించాలి

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. మార్కెట్‌లో బస్తా రూ.1,350 లోపే ఉండటంతో వరిసాగుతో నష్టపోయాం. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఒకటిన్నర ఎకరాల్లో వరిసాగు చేసేందుకు నారుమడి సిద్ధం చేసుకున్నాను. సకాలంలో సాగునీరు అందించి సాగుకు ముందే మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

– శివారెడ్డి, రైతు